

రూ.35 వేలతో ఎంపీపీ.. రూ.135తో జడ్పీటీసీ

● అయనే మొదటి ఎంపీపీ, జడ్పీటీసీ

పల్లె పోరు

7



అమ్మవారి సన్నిధిలో చిన్నారులకు సామూహిక అక్షర స్వీకారాలు

సరస్వతీ నమస్తుభ్యం

- వర్గల్ విద్యాధరి క్షేత్రంలో లక్షపుష్పార్చన, పుస్తక పూజ, సామూహిక అక్షర స్వీకారాలు
- అమ్మవారిని దర్శించుకున్న పుష్పగిరి పీఠాధిపతులు విద్యా శంకర నృసింహాభారతి, మాధవనంద సరస్వతీ స్వామిజీ

వర్గల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ విద్యాధరి క్షేత్రంలో అమ్మవారి శరన్నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం అమ్మవారి జన్మనక్షత్రమైన మూల నక్షత్రం సందర్భంగా విద్యా సరస్వతీ దేవిగా నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో అమ్మవారికి విశేష పంచామృతాభిషేకాలు, చండీహోమం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకలకు పుష్పగిరి పీఠాధిపతులు విద్యా శంకర నృసింహ్మభారతి స్వామిజీ, మాధవనంద సరస్వతీ స్వామిజీ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మండపంలో లక్ష పుష్పార్చనలు, చిన్నారులకు సామూహిక అక్షర స్వీకారాలు నిర్వహించారు. సుమారు 4వేల మంది చిన్నారులకు అక్షర స్వీకారాలు చేసినట్లు ఆలయ నిర్వహకులు తెలిపారు.



విద్యాసరస్వతీ అమ్మవారు

మూల పుస్తక రూపిణి సరస్వతీ పూజ

వేడుకల సందర్భంగా విద్యా సరస్వతీ అమ్మవారికి మూల పుస్తక రూపిణి సరస్వతీ పూజ, పుస్తకపూజ, చండీ హోమం, హారతి, మంత్ర పుష్ప తీర్థ ప్రసాదాలతో పాటు 56 రకాల స్వీట్లు (చెప్పన్ బోగ్)తో నివేదన సమర్పించారు. వేడుకలకు భక్తులు భారీగా తరలివచ్చారు.

సంగ్రామం

- తేలిన లెక్క..పోటీ పక్కా.. ● పరిషత్, గ్రామ పంచాయతీలకు మోగిన నగారా
- పల్లెల్లో వేడెక్కిన రాజకీయం ● రిజర్వేషన్ల అనుకూలతతో రంగంలోకి.. ● ఏర్పాట్లల్లో అధికారులు





సిద్దిపేట సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలపరిషత్, గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో గ్రామాల్లో రాజకీయం వేడెక్కింది. మండల పరిషత్‌కు రెండు విడతల్లో, గ్రామపంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు జరగనుండగా, అధికారులు ఈ దిశగా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఎక్కడికక్కడ కలెక్టర్లు ఎన్నికలు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎంతో కాలంగా ఎన్నికల్లో పోటీ చేయాలని ఎదురుచూస్తున్న గ్రామ, మండల స్థాయి నాయకులు ఒక్కసారిగా రెండు ఎన్నికలు రావడంతో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. రిజర్వేషన్లు అనుకూలంగా రానివారు సైతం పక్క మండలం, గ్రామంలో పోటీ చేస్తే

మిగతా 8వ పేజీలో

సిద్దిపేటలో మండల పరిషత్‌లు	26
మొదటి విడతలో ఎన్నికలు	15
రెండో విడతలో ఎన్నికలు	11

సిద్దిపేటలో మొత్తం ఓట్లు	6,55,958
పురుషులు	3,21,766
స్త్రీలు	3,34,186
ఇతరులు	06

గొర్రెల సొమ్ము దుర్వినియోగంపై కలెక్టర్ చర్యలు

- అధికారి సరెండర్, డబ్బు రికవరీ ● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పెంపక అభివృద్ధి పథకానికి (ఎస్ఆర్‌డీఎస్) కేటాయించిన రూ.2లక్షల నిధులను కార్యాలయ ఖర్చుల కోసం డ్రా చేసిన ఓ ఉన్నతాధికారిపై సిద్దిపేట కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. ఈ నిధులను రికవరీ చేసి, ఆ అధికారిని సరెండర్ చేశారు. ఎస్ఆర్‌డీఎస్ పథకం నిధులు డ్రా చేయకూడదని ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నప్పటికీ, వాటిని ఖాతరు చేయకుండా సదరు అధికారి రూ.2లక్షలను డ్రా చేశారు. ఈ విషయంపై గత నెల 7న "ఆంధ్రజ్యోతి" పత్రికలో 'కార్యాలయ ఖర్చుకు గొర్రెల సొమ్ము' శీర్షికతో కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన గొర్రెల పెంపక అభివృద్ధి సంఘం ప్రతినిధులు, జిల్లా వెటర్నరీ డాక్టర్లు కలెక్టర్ హైమావతికి ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన కలెక్టర్, సదరు అధికారి నుంచి రూ.2లక్షలను రికవరీ చేయించి సరెండర్ చేశారు. ఇక అదే కార్యాలయంలో ఏడీఏగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ కొండల్ రెడ్డికి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పాలపిట్టను బంధించి..

ప్రదర్శిస్తే జైలు

- నిబంధనలు ఉల్లంఘిస్తే తప్పదు జరిమానా
- అటవీశాఖాధికారుల హెచ్చరిక

7

ఇద్దరు ఉపాధ్యాయులకు ఇన్నోవేటివ్ టీచర్ అవార్డులు

7



సిద్దిపేటలో బతుకమ్మల నిమజ్జనం

సద్దుల వైభవం..

- బతుకమ్మ ఆటపాటలతో మురిసిన పల్లె, పట్నం
- తీరొక్క పూలతో బతుకమ్మలు

సిద్దిపేట కల్చరల్/హుస్నాబాద్, సెప్టెంబరు 29: సిద్దిపేటలో సద్దుల బతుకమ్మ సంబురం అంబరాన్ని తాకింది. పట్టణంలోని పలుచోట్ల ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో బతుకమ్మలను ఒకచోట చేర్చి మహిళాలంతా ఆటాపాటలతో సంబరాలు చేసుకున్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ లయబద్ధంగా కదులుతూ ఆడపడుచులు బతుకమ్మలో కొలువైన గౌరమ్మను వేడుకున్నారు. అనంతరం గంగమ్మ ఒడికి బతుకమ్మలను చేర్చారు. "పోయిరా బతుకమ్మ, మళ్లి వచ్చే యేడు తిరిగి రా బతుకమ్మ" అంటూ పాటలతో వేడుకున్నారు. వెంట తెచ్చుకున్న ప్రసాదాలు పరస్పరం పంపిణీ చేసుకున్నారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా, ట్రాఫిక్ ఇబ్బంది రాకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. సిద్దిపేటలోని పటేల్‌పురకు చెందిన నార్ల స్వర్ణలత నాగరాజు ఇంట్లో బతుకమ్మను వినూత్నంగా రూపొందించారు. ఏడు ఫీట్ల ఎత్తుతో తీరొక్క పూలతో అందంగా అలంకరించారు. కోమటిచెరువు వద్ద నిర్వహించిన వేడుకలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సందర్శించి చిన్నారులు, మహిళలతో ఆప్యాయంగా మాట్లాడారు. అంతకు ముందు ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన వేడుకల్లో హరీశ్ రావు సతీమణి శ్రీనిత మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.



హుస్నాబాద్‌లో బోటులో వేడుకలను పర్యవేక్షిస్తున్న మంత్రి పొన్నం



హుస్నాబాద్‌లో..

హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువు వద్ద సోమవారం సద్దుల బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. వేడుకలకు మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై మహిళలను ఆత్మీయంగా పలకరిస్తూ వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సంవత్సరం బతుకమ్మ వేడుకలకు ఎల్లమ్మ చెరువులో బోటు ఆకర్షణగా నిలిచింది. మంత్రి పొన్నం ప్రభాకర్ స్థానిక అధికారులతో కలసి బోటులో ప్రయాణిస్తూ పర్యవేక్షించారు. బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా ప్రమాదాలు

మిగతా 8వ పేజీలో



హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువుపై బతుకమ్మ ఆడుతున్న మహిళలు



అష్టలక్ష్మీ సహిత సద్దుల బతుకమ్మ




చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లో..



బతుకమ్మతో మహిళ



బతుకమ్మతో హరీశ్ దంపతులు



సమస్యలపై నిర్భయంగా ఫిర్యాదు చేయండి

● సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్



వినతిపత్రాలు స్వీకరిస్తున్న సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలు స్థానికంగా పరిష్కారం కాకపోతే నేరుగా తనకు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఫిర్యాదుదారుల నుంచి సమస్యలను ఓపికగా విన్నారు. వాటిని తక్షణమే పరిష్కరించే విధంగా సంబంధిత పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలతో మాట్లాడారు. చట్టాన్ని అమలు చేయడంలో ఎలాంటి అలసత్వం వహించరాదని అన్నారు. చట్ట ప్రకారం కేసులను పరిష్కరించాలని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను సత్వర పరిష్కారమే ధ్యేయంగా పోలీసు శాఖ పనిచేస్తుందని ఆయన తెలిపారు. పోలీసులు సివిల్ కేసుల్లో తల దూర్చవద్దని ఆయన సూచించారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

మెదక్ అర్బన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి పలు ఫిర్యాదులు వచ్చినట్లు ఏఎస్పీ వెల్లడించారు.





సింగూరుకు కొనసాగుతున్న వరద

● అవుట్ ఫ్లో లక్షా 6,137 క్యూసెక్కులు
● తెరుచుకున్న మరో గేట్
● 11 గేట్ల ద్వారా నీటి విడుదల



పుల్కల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సింగూరు ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ప్రవాహం కొనసాగుతూనే ఉన్నది. పెద్దఎత్తున వరదనీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు పది క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని కిందికి విడుదల చేస్తున్నారు. సోమవారం వరద ప్రవాహం పెరగడం 11వ నంబరు గేట్‌ను ఎత్తారు. ప్రస్తుతం 3, 4, 5, 8, 9,10, 11, 12, 14, 15, 16 క్రస్ట్ గేట్లను రెండు మీటర్లు ఎత్తి ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతిని వచ్చినట్లుగా దిగువన ఉన్న మంజీరా జలాశయానికి వదిలి పెడుతున్నారు. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో లక్షా 1000 క్యూ సెక్కులు నమోదైంది. 11 క్రస్ట్ గేట్ల ద్వారా 1,04,852 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి గేటు గుండా 1, 285 క్యూసెక్కులు, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌కు 80, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు, 390 క్యూసెక్కుల ఆవిరి, మొత్తం అవుట్ ఫ్లో లక్షా 6,137 క్యూసెక్కులు నమోదైంది. సింగూరు ప్రాజెక్టు పది గేట్లు ఎత్తి వరదనీరు దిగువకు విడుదలవుతుండడంతో నది పరీవాహక ప్రాంతంలో సాగవుతున్న వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. వరి, పత్తి, కంది తదితర పంటలన్నీ నీట మునిగాయి. నది గర్భం దాటి వరదనీరు విస్తరించి ప్రవహిస్తున్నది. శివ్వంపేట మంజీరా నది వద్ద ఉధృతి అధికంగా ఉండడంతో జాతీయ రహదారి వెంట వెళ్లే వాహనచోదకులు వంతెనపై నిలబడి నీటి ఉధృతిని తిలకిస్తున్నారు. ఉమ్మడి పుల్కల్ మండలంలోని సింగూరు, పోచారం, పుల్కల్, మిన్‌పూర్, కోడూరు, ఇసోజిపేట, గొంగ్లూరు, చక్రియాల, శివంపేట, వెండికోలు, లింగంపల్లి, కోర్పోల్, సరాఫ్‌పల్లి, చౌటకూర్ గ్రామాల శివారు భూములన్నీ జల దిగ్బంధంలోనే ఉన్నాయి. కాగా చౌటకూర్ సమీపంలో మంజీరానదిపై నిర్మించిన కొన్యాల వంతెన పైనుంచి మూడు మీటర్ల ఎత్తులో వరద నీరు ప్రవహిస్తున్నది.

ఆస్తి వివాదంలో తమ్ముడిని హత్య చేసిన అన్న



జైరామ్(ఫైల్)

కోహీర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి వివాదంలో తమ్ముడిని అన్న హత్య చేసిన సంఘటన సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని చింతలఘట్టు గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం... చింతలఘట్టు గ్రామానికి చెందిన బ్యాగరిమొల్లయ్య-భారతమ్మకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. పెద్దకొడుకు జయంత్, రెండో కొడుకు జైపాల్, మూడో కుమారుడు జైరామ్, కూతురు రుక్మిణి. ముగ్గురు కుమారులకు వివాహమైంది. ఎనిమిదేళ్ల క్రితమే మొల్లయ్య భార్య భారతమ్మ మృతిచెందగా రెండు నెలల క్రితం మొల్లయ్య అనారోగ్యంతో మరణించాడు. మొల్లయ్య పేరిట ఉన్న 10 గుంటల భూమిని అమ్మి వచ్చిన డబ్బు కుమారులు పంచుకున్నారు. పెద్ద కుమారుడు జయంత్ వృత్తిరీత్యా భార్య పిల్లలతో మునిపల్లి మండలం లింగంపల్లి గ్రామంలో నివాసం ఉంటూ కోహీర్ మండలంలోని ఓ పరిశ్రమంలో పని చేస్తున్నాడు. జైపాల్, జైరామ్(30) మద్యానికి బానిసై చింతల గట్టు గ్రామంలోనే ఇంటి వద్దనే ఉంటుండగా, భార్యలు వారిని విడిచి పుట్టింటికి వెళ్లిపోయారు. వారిద్దరు ఉన్న కొంత ఆస్తి కోసం రోజూ తాగి గొడవలు పడుతూ ఉన్నారు. ఆదివారం సాయంత్రం వీరి మధ్య గొడవ తీవ్రం కావడంతో విషయం తెలుసుకున్న పోలీసులు ఇద్దరికీ నచ్చజెప్పారు. మద్యం మత్తులో ఉన్న జైపాల్ తన తమ్ముడిని ఎలాగైనా హత మార్చాలనుకున్నాడు. ఆదివారం రాత్రి జైరామ్ ఇంటి వద్ద పండుకుని ఉండగా, జైపాల్ వంట చేసే కట్‌గిర్ పాత్రతో తమ్ముడిపై విచక్షణారహితంగా దాడిచేశాడు. దీంతో జైరామ్ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కోహీర్ ఎస్‌ఐ నరేష్ సోమవారం పోలీస్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. జైపాల్‌ను అరెస్టు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ సుపత్రికి తరలించారు. ఈ మేరకు జైపాల్‌పై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టామని ఎస్‌ఐ తెలిపారు.

పంట నష్టం అంచనా వేసి నివేదిక పంపించాలి

● ఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి



గుడూరు శివారులో మంజీరా పరీవాహక ప్రాంతాన్ని పరిశీలించి, పంట నష్టం గురించి అడిగి తెలుసుకుంటున్న ఉమాహారతి

నాగల్‌గిద్ద, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పంట నష్టం అంచనా వేసి నివేదిక పంపించాలని ఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. మండల పరిధిలోని గుడూరు గ్రామ శివారులో గల మంజీరా పరీవాహక ప్రాంతాన్ని సోమవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ఆమె వెంట తహసీల్దార్ శివక్రిష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన అంతర్రాష్ట్ర భజన పోటీలు



భజన పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఉద్గీర్ బృందానికి నగదు, మొమెంటోను అందజేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

జహీరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దేవీనవరాత్రుల సందర్భంగా పట్టణంలోని భవానీమందిర్‌లో భవానీ భజన మండలి, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వారంరోజులుగా నిర్వహించిన అంతర్రాష్ట్ర భజన పోటీలు సోమవారం ముగిశాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన భజన బృందం సభ్యుల కార్యక్రమాలను స్థానికులు ఆసక్తిగా తిలకించారు. సుమారు 15 భజన బృందాల మధ్య వారంరోజులపాటు పోటీలు కొనసాగాయి. పోటీల్లో ఉద్గీర్, జోగులాంబ గద్వాల్‌కు చెందిన భజన బృందం సభ్యులు మొదటి రెండుస్థానాల్లో నిలిచారు. ఉద్గీర్‌కు చెందిన సూర్‌దాస్ భజన మండలి సభ్యులకు ప్రథమ బహుమతిలో భాగంగా రూ.50 వేల నగదు, మెమొంటోను చేజిక్కుంచుకోగా, జోగులాంబ గద్వాల్‌కు చెందిన భవానీశంకర్ భజన మండలి బృందం సభ్యులు ద్వితీయ బహుమతి కింద రూ.30 వేల నగదు, మెమొంటోను కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, సూర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గొల్లభాస్కర్, అభిమానులు పాల్గొన్నారు.

నాలాలపై అక్రమ నిర్మాణాలను తొలగించాలి

● జాగో తెలంగాణ అధ్యక్షుడు రాములునేత



పట్టణంలోని హౌసింగ్ బోర్డుకు వెళ్లే అండర్ బ్రిడ్జి కింద వర్షపు నీరు నిల్వడంతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు

జహీరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలో నాలాలపై, నాలాలకు అడ్డంగా నిర్మించిన ఆక్రమణలను తొలగించాలని జాగో రాష్ట్ర అధ్యక్షుడు రాములునేత పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జనాభా పెరగడానికి తోడు భూముల ధరలు విపరీతంగా పెరగడంతో పట్టణంలో నాలాలు, వాగులు కబ్జాలకు గురయ్యాయన్నారు. దీంతో వర్షపు, మురుగునీరు ముందుకు వెళ్లడానికి వీలు లేకుండా పోయిందన్నారు. ప్రత్యేక బృందాలు వచ్చి పట్టణంలోని ఆక్రమణలను తొలగిస్తే ప్రజల సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. లేకపోతే జాగో తెలంగాణ ఆధ్వర్యంలో పట్టణంలో ఆందోళనను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పటాన్‌చెరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భార్యకుమార్తెలను మోటార్‌సైకిల్‌పై తీసుకెళ్తుండా, గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం.. కంది మండలం ఎర్దనూరు గ్రామానికి చెందిన కుమ్మరి కృష్ణ (44) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సద్దుల బతుకమ్మ పండుగ కావడం వల్ల సోమవారం ఉదయం సమయంలో భార్య కవిత, కుమార్తె శ్రీవాణిలతో కలిసి మోటారుసైకిల్‌పై వచ్చి ఇస్నాపూర్ పురపాలక పరిధి రుద్రారం గణేష్‌గడ్డ ఆలయంలో దర్శించుకున్నారు. తిరుగుప్రయాణంలో ఇస్మాయిల్‌ఖాన్‌పేట రోడ్డులో మలుపు తిరుగుతుండగా, గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో కుమ్మరి కృష్ణకు బలమైన గాయాలయ్యాయి. తీవ్రమైన రక్తస్రావం జరిగింది. ఆయన అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. భార్య కవిత, కుమార్తె శ్రీవాణిలు తీవ్రంగా గాయపడ్డారు. వారిద్దరిని స్థానికులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కృష్ణ సోదరుడు పోచయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదం కేసులో రెండేళ్ల జైలు

జోగిపేట రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష పడింది. ఎస్సై పాండు కథనం ప్రకారం.. 2014లో డివగత్ విజయ్, తన చెల్లెలుతో కలిసి జోగిపేట నుంచి తమ స్వగ్రామమైన లక్ష్మీనగర్ తండాకు వెళ్తున్నాడు. చౌటకూర్ మామిడి తోట సమీపంలో మద్యం మత్తులో ఉన్న లారీ డ్రైవర్ వేగంగా వచ్చి వీరి ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో విజయ్ మృత్యువాత పడగా, మోతీలాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపించారు. ఈ కేసులో నిందితుడికి రెండేళ్లే జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది.

ఫాంహౌస్‌లో పేకాట.. ఐదుగురు అరెస్ట్



రెడ్డిపల్లి సమీపంలోని ఓ ఫాంహౌస్ ప్రాంగణంలో పేకాట ఆడుతున్న వారిని అర్ధరాత్రి పట్టుకున్న పోలీసులు

నర్సాపూర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి శివారు ఓ ఫాంహౌస్‌లో పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనలో మరో ఆరుగురు పరారీలో ఉన్నారు. సోమవారం ఎస్సై రంజిత్ కేసు వివరాలను వెల్లడించారు. రెడ్డిపల్లి సమీపంలోని ఓ ఫాంహౌస్ సమీపంలో కొందరు పేకాట ఆడుతున్నట్టు రాత్రి 11 గంటల ప్రాంతంలో సమాచారం వచ్చింది. ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి బృందం అక్కడకు వెళ్లి, దాడి చేయగా పేకాట ఆడుతున్న కండిమెన వీరేశ్, సోక్కంపేట పరమేశ్వర్, జగన్‌గౌడ్, యాదగిరి, కిరణ్‌కుమార్ తీన్ పత్తా ఆడుతూ పట్టుపడ్డారు. పోలీసులను చూసి ఆరుగురు పరారయ్యారు. సంఘటనా స్థలంలో రూ. 3,800 నగదు, ప్లే కార్డులు, కారు, రెండు బైక్‌లు, 55 గేమింగ్ కాయన్స్, ఆరు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఫాం హౌస్ ఆవరణలో కొందరు పేకాట ఆడిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. వారు ఎవరై ఉంటారనేది పోలీసులు ఆరా తీస్తున్నారు.

బతుకమ్మ చెరువు వద్ద మైక్, ఎల్ఈడీ లైట్లు చోరీ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మధుకర్‌రెడ్డి

శివ్వంపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బతుకమ్మ పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన మైక్ సెట్, ఎల్ఈడీ లైట్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఎస్సై మధుకర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండల కేంద్రంలో బతుకమ్మ సంబురాల కోసం భారీ ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు మండల కేంద్రానికి చెందిన నవీన్ గుప్తా ఆధ్వర్యంలో చెరువు కట్టపై మైక్‌లు, ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 10 ఎల్ఈడీ లైట్లు, రెండు మైక్ సెట్లను అపహరించుకుపోయారు. మైక్ సెట్ల నిర్వాహకుడు కాముని అనిల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎస్సై మధుకర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

బతుకమ్మ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే

● జిల్లాల్లోనూ మాజీ ఉప సభాపతి



సిరిసిల్లలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బతుకమ్మ పండుగ వేడుకల్లో బీఆర్ఎస్ తరఫున మాజీ ఎమ్మెల్యే, మాజీ ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఉద్యమ సమయంలో, ఆ తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో మాజీ సీఎం కేసీఆర్ తనయ కవిత తెలంగాణ జాగృతి తరఫున అన్ని తానై నడిపించారు. రోజుకో జిల్లాలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ప్రస్తుతం ఆమె పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురికావడంతో ఆ బాధ్యత ఇప్పుడు పద్మాదేవేందర్‌రెడ్డిపై పడినట్లు తెలుస్తోంది. ఈ మేరకు జిల్లాలో జరిగే బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొనాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశించినట్లు సమాచారం. దీంతో పద్మాదేవేందర్ రెడ్డి ప్రతి జిల్లాకు వెళ్తూ మహిళలతో కలిసి సంబరాల్లో పాల్గొంటున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని సిరిసిల్ల, వేములవాడ, బాన్సువాడ, జగిత్యాల, కరీంనగర్, హన్మకొండ, వరంగల్, కరీంనగర్‌లలో పార్టీ నాయకులు, మహిళలు, ప్రజలతో కలిసి బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్నారు. పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరంలోని పీపుల్‌ప్లాజా వద్ద జరిగిన కార్యక్రమంలోనూ పాల్గొన్నారు.

పాలపిట్టను బంధించి.. ప్రదర్శిస్తే జైలు

● నిబంధనలు ఉల్లంఘిస్తే తప్పదు జరిమానా
● జిల్లా అటవీ శాఖాధికారి హెచ్చరిక

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగ సందర్భంగా ఎవరైనా పాల పిట్టను పట్టుకోవడం, బంధించి ప్రదర్శించడం వంటివి చేస్తే వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం జైలు శిక్ష తప్పదని జిల్లా అటవీశాఖ అధికారి శ్రీధర్‌రావు ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎవరైనా వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని ఉల్లంఘిస్తే రూ.లక్ష వరకు జరిమానా విధిస్తామని అన్నారు. నేరాన్ని ప్రోత్సహించే వారు కూడా శిక్షార్హులుగా పరిగణించబడతారని చెప్పారు. తెలంగాణ, ఒరిస్సా, కర్నాటక రాష్ట్ర పక్షి పాలపిట్ట అని, ప్రస్తుతం అది ప్రమాదంలో పడిందని అన్నారు. వర్షపాతం అంతగా ఉండని మెట్ట ప్రాంతాలు, గడ్డి మైదానాలు, బీడు భూములు, చిట్టడవులు వంటి బహిరంగ ప్రదేశాలు పాలపిట్టకు ఆవాసాలని తెలిపారు. చిన్నపాటి క్రిమి కీటకాలు, ఉభయ చరాలను అవి ఆహారంగా తీసుకుంటాయన్నారు. పాల పిట్టలు రైతు నేస్తాలని, పంటలనావరించే కీటకాలు తింటాయని తెలిపారు. సహజ ఆవరణ వ్యవస్థ నాశనం కావడం వల్ల పాలపిట్ట మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒకప్పుడు ఎక్కడపడితే అక్కడ కనిపించే పాల పిట్టలు ఇప్పుడు వెతికినా కనిపించడం లేదన్నారు. ఈ కారణంగా దసరా సందర్భంగా పాలపిట్టలను బంధించి, పంజరంలో ఉంచి జనాలకు చూపిస్తున్నారని, అది అత్యంత అమానవీయమని, శాస్త్ర, చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం పాలపిట్టలను పట్టుకోవడం, బంధించడం, ప్రదర్శించడం చేయడం నేరమని, ఇందుకు మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తామన్నారు. అదే నేరం రెండోసారి చేస్తే మూడు నుంచి పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా ఉంటుందని పేర్కొన్నారు.

తల్లీకూతుళ్ల హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

చేగుంట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తల్లీకూతుళ్ల హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా జడ్జి నీలిమ సోమవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. మండలంలోని వడియారం గ్రామానికి చెందిన మర్రికింది నగేష్ 2022 ఏప్రిల్ 10న నార్సింగ్ మండలం వల్లూరు గ్రామం చెందిన శంభుని యాదమ్మ (45) శంభుని సంతోష (19)లను నమ్మించి వడియారం శివారులోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి చున్నీతో ఉరివేసి హత్య చేశాడు. ఈ కేసులో అప్పటి సీ.ఐ చంద్రశేఖర్ రెడ్డి దర్యాప్తు చేశారు. కేసు సాక్ష్యాలు బలంగా ఉండటంతో మెదక్ జిల్లా జడ్జి నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ. 5వేల జరిమానా విధించారని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.


ఏడుపాయల్లో ఘనంగా బోనాల ఊరేగింపు

● సరస్వతీ దేవి రూపంలో దుర్గామాత
● బోనమెత్తిన మైనంపల్లి శివాని

పాపన్నపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల్లో దుర్గామాతకు మహిళలు బోనాల ఊరేగింపును సోమవారం ఘనంగా నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ప్రతిఏటా అమ్మవారికి బోనాల ఊరేగింపు చేపట్టడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంతో, చేతిలో వీణా ధారిణియై తెలుపు రంగు వస్త్రాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు శంకరశర్మ, పార్థివశర్మ ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సతీమణి శివాని ముఖ్యఅతిథిగా హాజరై బోనమెత్తారు. ఏడుపాయలకు వచ్చిన శివానికి ఈవో చంద్రశేఖర్ ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం లాంచనంగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మహిళలతో కలిసి బోనమెత్తారు.

వందలాదిగా మహిళలు

శివాని, జోగిని రాధికలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన వందలాది మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఊరేగింపు ఆద్యాంతం డప్పుచప్పుళ్లకు అనుగుణంగా, చెర్న కోళ చేతబట్టి జోగిని రాధిక నృత్యాలు అందరినీ అలరించాయి గోకుల్ షెడ్డు నుంచి రాజగోపురం వరకు బోనాల ఊరేగింపు జరిగింది. రాజగోపురంలో కొలువుదీరిన మూల విరాట్ దుర్గామాత ఉత్సవ విగ్రహానికి బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో బోనం హక్కుదారు సాయిరెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, గోవింద్‌నాయక్, శ్రీకాంతప్ప, శ్రీకాంత్‌రెడ్డి, గౌస్, భరత్‌గౌడ్, దుర్గేష్, రాజశేఖర్, పట్లోళ్ల నాగరాజు, మంగలి, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.





సరస్వతీ అలంకరణలో.., ఏడుపాయల్లో నిర్వహించిన బోనాల ఊరేగింపులో ఎమ్మెల్యే సతీమణి శివాని

సరస్వతీదేవిగా విజయదుర్గ

కొండపాక, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కొండపాక మండలం మర్పడగ విజయ దుర్గ సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో సోమవారం విజయ దుర్గామాత సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది.



సరస్వతీ దేవిగా అమ్మవారు

ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి

ఝరాసంగం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో దుర్గాదేవి సోమవారం భక్తులకు సరస్వతీదేవిగా దర్శనమిచ్చింది. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.



పూజలందుకుంటున్న దుర్గాదేవి

ఆర్టీసీ యాత్రాదానం

మెదక్ అర్బన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఆదాయాన్ని పెంచుకోవడానికి అన్ని మార్గాలను అన్వేషిస్తోంది. ఆధ్యాత్మిక కేంద్రాలకు యాత్ర బస్సులు నడుపుతున్న సంస్థ.. ఆయా ప్రదేశాలకు అనాథలు, పేదలు, వృద్ధులు పుణ్యక్షేత్రాలు దర్శించుకునేందుకు దాతల చేయూతతో యాత్రాదానం పేరిట వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. అన్నదానం, నేత్రదానం, రక్తదానం, అవయవదానం లాగానే యాత్రాదానం చేసేందుకు ముందుకొచ్చే దాతలు, సంస్థల సేవలను వినియోగించుకునేందుకు సిద్ధమైంది.

యాత్రాదానం ఇలా...

అనాథలు, వృద్ధులు, పేదలు, దివ్యాంగులు, విద్యార్థులకు తీర్థయాతలు చేయాలని, ఆలయాలు దర్శించుకోవాలన్న కోరిక ఉంటుంది. కానీ, ఆర్థిక పరిస్థితుల కారణంగా అది నెరవేరని వారు ఉంటారు. ఇలాంటి వారికి తీర్థయాతల భాగ్యం కల్పించేలా.. దాతలు ముందుకు వచ్చి వారి పుట్టిన రోజులు, వివాహ వార్షికోత్సవాలు, పండగలు, శుభకార్యాలు తదితర ప్రత్యేక దినాల్లో వారిని యాత్రలకు తీసుకెళ్లేందుకు బస్సులు బుక్ చేసుకునేందుకు ఆర్టీసీ యాత్రాదానం కార్యక్రమం ద్వారా అవకాశం కల్పిస్తోంది. వ్యక్తులతో పాటు ప్రజా ప్రతినిధులు, కార్పొరేట్ సంస్థలు, ఎన్ఆర్ఐలు, స్వచ్ఛంధ సంస్థలు, ఇందుకు నిధులు సమకూర్చవచ్చు. వారం రోజుల ముందు బస్ బుక్ చేసుకోవాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.



యాత్రాదానం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, డీఎం సురేఖ

ప్రత్యేక టూర్ బస్సులు

మెదక్ డిపో నుంచి ఇప్పటికే విహార, పుణ్యక్షేత్రాల సందర్శనకు ప్రత్యేక టూర్ యాత్ర బస్సులను నడిపిస్తున్నారు. ప్రయాణికులు, యాత్రికుల నుంచి స్పందన లభిస్తుండగా వినూత్న కార్యక్రమాలకు ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. పెళ్లిళ్ల, విహార యాత్రలకు బస్సులను సమకూరుస్తోంది.

యాత్రాదానంతో సహాయం : సురేఖ, డీఎం మెదక్

ఆర్టీసీ చేపట్టిన యాత్రాదానం ద్వారా దాతలు పుణ్యక్షేత్రాలకు, విహార యాత్రలకు వెళ్లలేని వారిని పంపించవచ్చు. పెళ్లిళ్ల, జన్మదినం రోజుల సందర్భంగా దాతల సహకారంతో అనాథలు, వృద్ధులు పేదలు, స్కూల్ విద్యార్థులను తీసుకెళ్లడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం.

స్పెషల్ బస్సుల పేరుతో నిలువు దోపిడీ

● రూ.110 నుంచి రూ.150కి పెంచిన అధికారులు

అల్లాదుర్గం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పండుగల వేళ ఆర్టీసీ ప్రయాణికులకు షాక్ ఇస్తున్నది. స్పెషల్ బస్సుల పేరుతో చార్జీలను భారీగా పెంచి నిలువు దోపిడీ చేస్తుండడంపై ప్రయాణికులు ఆర్టీసీ అధికారులపై దుమ్మెత్తి పోస్తున్నారు. సంగారెడ్డి నుంచి అల్లాదుర్గానికి రూ.110 టికెట్ ధర ఉండగా.. రూ.40 పెంచి రూ.150 వసూలు చేస్తున్నారు. 50 కిలోమీటర్ల దూరానికి రూ.40 పెంచితే దూర ప్రాంతాలకు మరింత వసూలు చేస్తున్నారని మండిపడుతున్నారు. ప్రత్యేక బస్సుల పేరుతో పల్లెవెలుగు (ఆర్డినరీ) బస్సులను నడుపుతూ ఇంత భారీగా వసూలు చేయడమేంటని కండక్టర్లను నిలదీస్తే ఏమీ చెప్పలేని పరిస్థితి. మహిళకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని గొప్పలు చెప్పుకునే ఆర్టీసీ సంస్థ బస్సు చార్జీల పెంపుపై ఎందుకు స్పందించదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రమేశ్‌కు జాతీయ సాహితీ కిరిటీ పురస్కారం

నంగునూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా నంగునూరుకు చెందిన కవి, రచయిత దేవులపల్లి రమేశ్‌కు జాతీయ సాహితీ కిరీటి పురస్కారం లభించింది. హైదరాబాద్ బిర్లా ఆడిటోరియంలో జరిగిన శ్రీశ్రీ కళావేదిక, 155వ పట్టాభిషేక మహోత్సవం సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక మేనేజింగ్ డైరెక్టర్ డా.కత్తి మండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం, యువజన అధ్యక్షుడు గరిమెళ్ల రాజేంద్రప్రసాద్ చేతులమీదుగా సోమవారం రమేశ్ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జాతీయస్థాయిలో సాహితీ కిరీటి పురస్కారం పొందడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, నూక సంపత్‌కుమార్, సతీష్, విజయ్‌కుమార్, కరుణాకర్, వివిధ రాష్ట్రాల కవులు కళాకారులు పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న రమేశ్

ఇద్దరు ఉపాధ్యాయులకు ఇన్నోవేటివ్ టీచర్ అవార్డు

వర్గల్/నంగునూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జటాధర ఎడ్యుకేషనల్ టెక్నాలజీ(జేఈటీ) అకాడమి 2025 సంవత్సరానికిగాను నిర్వహించిన ఇన్నోవేటివ్ టీచర్ అవార్డుకు రాష్ట్రంలో 50 మంది ఉపాధ్యాయులను చేశారు. అందులో సిద్దిపేట జిల్లా వర్గల్ జడ్పీ హెచ్ఎస్ తెలుగు ఉపాధ్యాయుడు అమరవాది రాజశేఖరశర్మ ఎంపికయ్యారు. సోమవారం హైదరాబాద్ హరిహర కళాభవన్‌లో టీహబ్, ఆధ్యా చీఫ్ ఆపరేటింగ్ అధికారి అనీష్ అంథోని నుంచి రాజశేఖరశర్మ అవార్డును అందుకున్నారు. అలాగే నంగునూరు మండలం సిద్ధన్నపేటకు చెందిన, కొమురవెల్లి మండలం గురువన్నపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డీ.గిరిబాబు కూడా ఇన్నోవేటివ్ అవార్డును అందుకున్నారు. ఫౌండేషన్ డైరెక్టర్ అరుణ్‌కుమార్ గిరిబాబుకు అవార్డు అందజేశారు.



అవార్డులతో రాజశేఖరశర్మ, గిరిబాబు





నిజాంపేట గ్రామం, నిజాంపేటలోని తహసీల్దార్ కార్యాలయం

నిజాంపేటకు ఎన్నికళ

● మండలం ఏర్పడి మూడేళ్లు
● తొలిసారి జరగనున్న ఎన్నికలు
● ఆరు ఎంపీటీసీలు, 18 గ్రామపంచాయతీలు
● 152 వార్డులు, 17,518 మంది ఓటర్లు



నిజాంపేట ఎంపీపీ కార్యాలయం

నారాయణఖేడ్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నూతన మండలంగా ఏర్పడిన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నిజాంపేట మండలానికి మొదటిసారిగా ఎన్నికలు జరుగనుండడంతో ప్రజాప్రతినిధులు ఆనందంలో మునిగి తేలుతున్నారు. 2022లో నిజాంపేటను 18 గ్రామపంచాయతీలు, ఆరు ఎంపీటీసీ స్థానాలతో నూతన మండలంగా ఏర్పాటు చేశారు. నారాయణఖేడ్ మండలంలోని రెండు రెవెన్యూ గ్రామాలు, కల్హేర్ మండలంలోని మూడు రెవెన్యూ గ్రామాలతో పాటు మెదక్ జిల్లాలోని పెద్దశంకరంపేట మండలం జంబికుంట గ్రామాన్ని కలిపి 18 గ్రామపంచాయతీలతో నూతన మండలాన్ని ఏర్పాటు చేశారు. నిజాంపేటలో 17,518 మంది ఓటర్లు ఉండగా, 8,508 మహిళా ఓటర్లు, 9,006 పురుషులు, నలుగురు ఇతర ఓటర్లు ఉన్నారు.

తాత్కాలిక భవనాల్లో కార్యాలయాలు

నూతనంగా ఏర్పాటైన నిజాంపేట మండలంలో తహసీల్ కార్యాలయాన్ని గ్రామ పంచాయతీ, ఎంపీపీ కార్యాలయాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేశారు. సొంత భవనాలను నిర్మించేందుకు ఇటీవల భూమిని సైతం కేటాయించారు. భవనాలను నిర్మించాల్సి ఉంది.

ఏర్పాటు కాని పోలీస్‌స్టేషన్

నిజాంపేట మండలాన్ని ప్రారంభించి మూడేళ్లు కావస్తున్నా ఇంకా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయలేదు. దీంతో నిజాంపేట మండల పరిధిలోని గ్రామాల్లో ఏవైనా శాంతి భద్రతల సమస్యలు తలెత్తితే గత పాత మండలాల్లోని పోలీస్‌స్టేషన్లలోనే ఫిర్యాదులు చేయాల్సి వస్తుంది. అందువల్ల ప్రభుత్వం వెంటనే పోలీస్‌స్టేషన్‌ను, ఐకేపీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి. కాగా మండల విద్యాధికారిని నియమించినా ఎంఈవో కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తే పూర్తిస్థాయి మండల సేవలు అందుబాటులోకి వస్తాయని స్థానికులు అంటున్నారు.

డిప్యూటేషన్‌పైనే సిబ్బంది

నిజాంపేటను మండల కేంద్రంగా ప్రకటించి తహసీల్, ఎంపీపీ కార్యాలయాలను ప్రారంభించినప్పటికీ.. సిబ్బందిని డిప్యూటేషన్‌పైనే నియమించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొత్త మండలాలకు రెగ్యులర్ సిబ్బందిని నియమించింది. సంగారెడ్డి జిల్లాలో నిజాంపేట, చౌటకూర్ మండలాలు ఒకేసారి ఏర్పాటైనా ఇటీవల చౌటకూర్ మండల తహసీల్ కార్యాలయానికి పూర్తిస్థాయిలో రెగ్యులర్ సిబ్బందిని నియమించి, నిజాంపేటకు నియమించలేదు. రెగ్యులర్ సిబ్బందిని నియమించాలని పలువురు కోరుతున్నారు.

మొదటిసారిగా ఎన్నికలు జరగనుండడం ఆనందంగా ఉంది



నిజాంపేట మండల కేంద్రంగా ఏర్పాటైన తర్వాత మొదటిసారిగా ఎన్నికలు జరుగనుండడం ఆనందంగా ఉంది. తమ గ్రామం నుంచే పాలన కొనసాగడం గర్వకారణం.

- జగన్‌చారి, మాజీ సర్పంచ్

కల నెరవేరింది



నిజాంపేట మండల కేంద్రం కావడం వల్ల ఎన్నోఏళ్ల కల ఫలించింది. ఇప్పటికే తహసీల్, ఎంపీపీ కార్యాలయాల సేవలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే సంజీవరెడ్డి సహకారంతో త్వరలో పోలీస్‌స్టేషన్‌తో పాటు ఇతర అన్ని కార్యాలయాలు ఏర్పాటుకు కృషి చేస్తాం.

- రాధాక్రిష్ణ, మాజీ ఏఎంసీ డైరెక్టర్

మండలం ఏర్పాటుతో పరిపాలన సౌలభ్యం



నిజాంపేట మండల కేంద్రంగా ఏర్పాటు కావడంతో పరిపాలన సౌలభ్యంగా ఉండనున్నది. గతంలో ప్రతీ పనికి నారాయణఖేడ్ వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం అన్ని పనులు తమ వద్దే పరిష్కరించుకోవచ్చు.

- సాయిరెడ్డి, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు

ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు గుర్తించాం



మండల కేంద్రమైన నిజాంపేటలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాం. స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి సహకారంతో తహసీల్, ఎంపీపీ, కార్యాలయాలకు భవనాలను నిర్మించడానికి కృషిచేస్తాం.

- లింగారెడ్డి, మాజీ ఎంపీటీసీ

రూ.35 వేలతో ఎంపీపీ.. రూ.135తో జడ్పీటీసీ

● ఆయనే మొదటి ఎంపీపీ, జడ్పీటీసీ



తలారి సత్తయ్య

తూప్రాన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేయాలా.. కావాల్సిన అర్హతల్లో ఒకటి డబ్బు. గ్రామంలో ఎంత మంచి పేరు ఉన్నా ఎంత ఖర్చు చేయగలరనే లెక్క తేలితేనే ఏ పార్టీ అయినా సపోర్టు చేస్తుంది. కానీ, ఒకప్పుడు చాలా తక్కువ ఖర్చుతో రాజకీయం చేసిన వారు ఉన్నారు. కేవలం రూ.35 వేలతో ఎంపీపీగా, జడ్పీటీసీ ఎన్నికల్లో రూ.135 పెట్రోల్ ఖర్చుతో జడ్పీటీసీగా మొట్టమొదట గెలిచారు మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణానికి చెందిన 76 ఏళ్ల తలారి సత్తయ్య. బీజేపీతో రాజకీయ జీవితం ప్రారంభించిన తలారి సత్తయ్య టీడీపీలో మంచి గుర్తింపు పొందారు. ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులు, తెలంగాణ ఫుడ్స్ కమిషన్ మాజీ చైర్మన్ గంగుమల్ల ఎలక్షన్‌రెడ్డి సహాయంతో రాజకీయాల్లో రాణించారు. 1980లో బీజేపీలో మండల అధ్యక్షుడిగా కొనసాగినట్లు తలారి సత్తయ్య తెలిపారు. 1982లో స్వతంత్ర అభ్యర్థిగా తూప్రాన్ గ్రామపంచాయతీ వార్డుసభ్యుడిగా గెలుపొందారు. దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీలో చేరిన సత్తయ్య 1987లో మొట్టమొదటగా నేరుగా జరిగిన ఎన్నికల్లో డైరెక్ట్ విధానంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్ష పదవికి పోటీచేశారు. ఆనాడు సీనియర్ నాయకులతో తలపడి భారీ మెజారిటీతో గెలుపొందారు. ఎన్నికల్లో ఉమ్మడి తూప్రాన్ మండల ఎంపీపీగా పోటీ చేసేందుకు ఆనాడు రూ.35 వేలు ఖర్చు అయినట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారం చేసేందుకు కేవలం రూ.35 వేలు ఖర్చు చేశానని, ఈనాడు ఎన్నికల్లో పోటీ చేసేందుకు కోట్లు కావాలని చెప్పుకొచ్చారు. ఎంపీపీ అధ్యక్షులే జడ్పీలో సభ్యులుగా కొనసాగారు. మూడంచల పంచాయతీరాజ్ వ్యవస్థ అమల్లోకి రావడంతో 1995లో జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించారు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో తలారి సత్తయ్య జడ్పీటీసీగా టీడీపీ తరఫున పోటీ చేశారు. ఎన్నికల్లో మండలంలో రెండు పర్యాయాలు తిరిగేందుకు రూ.135లతో బైక్‌లో పెట్రోల్ పోసుకొని పర్యటించినట్లు వివరించారు. జడ్పీటీసీ ఎన్నికల్లో కేవలం రూ.135 ఖర్చులతో గెలుపొందారు. ఇప్పట్లో జడ్పీటీసీగా ఎన్నికల్లో పోటీ చేసేందుకు రెండు, మూడు కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు సత్తయ్య. ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆనాడు తక్కువ ఖర్చు పెట్టేవారమని, ఈనాడు ఖర్చులు భారీగా పెరిగిపోయాయి అన్నారు. నాడు సేవ చేసేందుకు రాజకీయాల్లో వచ్చేవారని, నేడు ఆ పద్ధతి లేకుండా పోయిందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు చేసిన ఖర్చును రాబట్టుకుంటున్నారని తెలిపారు. ఆనాడు కొందరు సంపాదనపై దృష్టి పెట్టినప్పటికీ ఇప్పటి స్థాయిలో ఉండేది కాదన్నారు. వార్డు సభ్యుడిగా, ఎంపీపీగా, జడ్పీటీసీగా గెలుపొందిన తలారి సత్తయ్య ఎలాంటి ఆస్తులు సంపాదించుకోలేదు. ప్రస్తుతం భార్య ఓ ప్రైవేటు కళాశాలలో పనిచేస్తే జీవితం గడిచిపోతున్నట్లు సత్తయ్య చెప్పుకొచ్చారు.

నేపాల్ వాసి అదృశ్యం



టికారం(ఫైల్)

తూప్రాన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లోని తన స్వగ్రామానికి వెళ్లేందుకు బయలుదేరిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. తూప్రాన్ ఎస్సై శివానందం కథనం ప్రకారం.. నేపాల్ దేశం గైడకోట్ గ్రామానికి చెందిన లీలారాం దమ్మై, అతడి అన్న కొడుకు టికారాం దమ్మై (45) బతుకుదెరువు కోసం చెన్నై వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు. ఈ నెల 22న నేపాల్ సరిహద్దు సునోలి బజారు నుంచి చెన్నై బయలు దేరారు. 25న సికింద్రాబాద్‌కు చేరుకున్నారు. బస్సు దిగిన తరువాత టికారాం మనసు మార్చుకొని.. తాను తిరిగి స్వగ్రామానికి వెళ్లిపోతానని చెప్పడంతో అదే బస్సులో వెనక్కి పంపించారు. తూప్రాన్ పట్టణ పరిధి హైవే బైపాస్‌లో ఓ దాబా వద్ద టిఫిన్ చేసేందుకు బస్సు నిలిపారు. అందరితో పాటు బస్సు దిగిన టికారం ఆ తర్వాత కనిపించకుండా పోయాడు. వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.


కొమురవెల్లి మల్లన్న ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు


తొగుటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


హుస్నాబాద్‌లో..


జగదేవ్ పూర్ మండలం దౌలాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


ములుగులో బతుకమ్మతో మహిళలు


దుద్దెడలో ..


దుబ్బాకలో బతుకమ్మ సంబరాలల్లో ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి


బెజ్జంకి మండలం గాగిల్లాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


కోమటిచెరువుకట్టపై సద్దుల బతుకమ్మ సంబరాల్లో పూజల హరికృష్ణ

కనులపండువగా సద్దులు

సద్దుల బతుకమ్మ పండుగ సంబరాలను జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి సాయంత్రం వేళలో గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో మహిళలు బతుకమ్మలను పెట్టి ఆడారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేసి వాయినం ఇచ్చి పుచ్చుకున్నారు. దుబ్బాక మున్సిపల్ కమిషనర్ కళ్యాణ రమేష్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాలల్లో ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మెన్ బక్కివెంకటయ్యలు పాల్గొన్నారు.

న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి)


చేర్యాలలో సద్దుల బతుకమ్మలతో మహిళలు


మద్దూరులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


సిద్దిపేట రూరల్ : చింతమడకలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్లు


తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన కె. ప్రవీణ్‌రెడ్డి

తొగుట/కోహెడ/మద్దూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ధూళిమిట్ట మండల తహసీల్దారుగా కె. ప్రవీణ్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన తహసీల్దారు మధుసూదన్ అక్కన్నపేట తహసిల్దారుగా వెళ్లారు. మండల ప్రజల సహకారంతో మండల మండలాభివృద్ధికి పాటుపడనున్నట్లు తెలిపారు

తొగుటలో సమీర్ అహ్మద్ ఖాన్


సమీర్ అహ్మద్ ఖాన్

తొగుట నూతన తహసిల్దారుగా ఎండీ. సమీర్ అహ్మద్ ఖాన్ సోమవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన శ్రీకాంత్ బదిలీపై కోహెడకు వెళ్లడంతో ఇక్కడ కాళీ ఏర్పడింది. దాంతో కోహెడలో పనిచేస్తున్న ఎండి సమీర్ అహ్మద్ ఖాన్‌ను జిల్లా కలెక్టర్ హైమావతి తొగుటకు బదిలీ చేయడంతో సోమవారం ఆయన పదవి బాధ్యతలు చేపట్టారు.

కోహెడలో చంద్రశేఖర్


సన్మానం చేస్తున్న డీటీ, రెవెన్యూ సిబ్బంది

కోహెడ మండల తహసీల్దార్‌గా పంపరి చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బెజ్జంకి మండల తాహసీల్దార్‌గా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ మహమ్మద్ సమీర్ అహ్మద్ ఖాన్ తోగుట్ట మండలం తాహసీల్దారుగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ పరిధిలో సమస్యలను పరిష్కరించి శక్తి వంచన లేకుండా సేవలందిస్తానన్నారు. ప్రజలకు పారదర్శక, వేగవంతమైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

వెంకటాచారి కుటుంబానికి ఆర్థిక సహాయం

ములుగు సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వెంకటాచారి కుటుంబానికి అన్ని విధాల కాంగ్రెస్ పార్టీ ఆదుకుంటుందని సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన ములుగులో వారం రోజుల క్రితం వడ్ల వెంకట చారి మృతి చెందాడు. నర్సారెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట. జిల్లా పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్ రెడ్డి, నరసింహారెడ్డి, ములుగు గ్రామ కమిటీ అధ్యక్షుడు కొండు నరసింహులు,అబుద్దీన్, రంగ సత్యనారాయణ గౌడ్‌తో పాటు తదితరులు ఉన్నారు


కొత్తూరులో పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ చేసిన అయ్యప్ప స్వాముల కమిటీ

పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ

ములుగు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ దసరా పండుగ పురస్కరించుకొని సోమవారం ములుగు మండలం కొత్తూరులో గ్రామపంచాయతీ కార్మికులకు అయ్యప్ప స్వాముల కమిటీ తరఫున దుస్తులు పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు యాదగిరి గౌడ్, రవి ముదిరాజ్, నాగరాజు, గణేష్ రవితో పాటు పంచాయతీ కార్మికులు ఉన్నారు.

మతం మారిన వారికి కులం సర్టిఫికేట్ జారీ చేయవద్దు

● బీజేపీ గజ్వేల్ మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్

గజ్వేల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మతం మారిన వారికి కులం సర్టిఫికేట్ జారీ చేయవద్దని బీజేపీ గజ్వేల్ మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గజ్వేల్ తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ మతానికి సంబంధించిన ఎస్సీ, ఎస్టీ కులం వారు క్రిస్టియన్ మతానికి మారిన వారికి ఎస్సీ, ఎస్టీ సర్టిఫికేట్ జారీ చేయడం వలన ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, విద్యా, స్థానిక ఎన్నికల రిజర్వేషన్లు, ప్రభుత్వ ఉద్యోగుల రిజర్వేషన్లలో నిజమైన ఎస్సీ, ఎస్టీ కులానికి చెందిన వారు నష్టపోతున్నారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ సర్టిఫికేట్‌కు దరఖాస్తు చేస్తే విచారణ చేసిన తర్వాతనే సర్టిఫికేట్ జారీ చేయాలని అన్నారు. వారితో బీజేపీ నాయకులు వంజరి రాజు, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు మన్నె శేఖర్, మండల ప్రధాన కార్యదర్శి ఇప్ప స్వామి, మండల ఉపాధ్యక్షులు శ్రీకాంత్‌గౌడ్, మండల కార్యదర్శి చందు, బీజేవైఎం నాయకులు అనిల్, మండల నాయకులు గడ్డం నవీన్, మురారి లక్ష్మణ్, మహిపాల్, మధు తదితరులున్నారు.

ఆలయ అభివృద్ధి పనుల్లో వేగం పెరిగేలా చూడండి

కొమురవెల్లి,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి):ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి సన్నిధిలో భక్తుల సౌకర్యార్థం బండగుట్టపై నిర్మిస్తున్న 50 గదుల సత్రం, దేవాలయం సమీపంలో నిర్మిస్తున్న క్యూకాంప్లెక్స్ భవనం, నూతన 100 గదుల సత్రం నిర్మాణానికి శంకుస్థాపన,మిగతా అభివృద్ధి పనుల్లో వేగం పెంచేలా చూడాలని అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం సిద్దిపేట కలెక్టర్ హైమావతిని సమీకృత కార్యాలయంలో మల్లన్న ఆలయ ఈవో టంకశాల వెంకటేష్ కలిసి నివేదిక సమర్పించారు. స్పందించిన కలెక్టర్ త్వరలోనే ఆలయాన్ని సందర్శిస్తానని తెలిపి పనుల్లో వేగం పెరిగేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేస్తానని తెలిపినట్లు ఆలయ ఈవో తెలిపారు.

మల్లన్న ఆలయంలో దేవి త్రిరాత్రోత్సవాలు


విశేష అలంకారణలో అమ్మవారు

కొమురవెల్లి,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి):ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ఆనవాయితీగా వస్తున్న దేవి త్రిరాత్రోత్సవాలకు సోమవారం అంకురర్పణ చేశారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రారంభ అగ్రోదగం,గణపతి పూజ నిర్వహించి మంటపదేవత ఆరాధన,కలశస్థాపన,అమ్మవారికి విశేషంగా చతుష్షష్టుపచార మహపూజ, మహాసరస్వతి హోమం, మహా మంగళహారతి,మహా మంత్రపుష్ప సమర్పణ కార్యక్రమాలను నిర్వహించారు.

పండుగ పూట పస్తులుండాల్సిన పరిస్థితి


వినతి పత్రం ఇచ్చిన అనంతరం మాట్లాడుతున్న రేషన్ డీలర్లు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన కమీషన్, సెప్టెంబరు నెల స్టేట్ కమీషన్ విడుదల కాలేదని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు వంగరి నాగరాజు అన్నారు. తమకు రావాల్సిన కమీషన్ ఇప్పించాలని సిద్దిపేట జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆరు నెలలుగా కమీషన్ రాకపోవటంతో డీలర్లు ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. పండుగ పూట పస్తులుండాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అలాగే ఎమ్ఎల్‌సీ పాయింట్ల వద్ద వే బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. వే బ్రిడ్జ్‌లు లేకపోవటం వలన తూకంలో తేడాలు వస్తున్నాయని, 50 కేజీల బ్యాగుల్లో 48, 49 కిలోలు మాత్రమే వస్తున్నాయని చెబుతున్నారు. దీనివల్ల రేషన్ డీలర్లు నష్టపోవటమే కాకుండా అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు స్టాక్‌లో తేడాలుండటం వలన కేసులు అవుతున్నాయన్నారు. గత ఎన్నికల సమయంలో మేనిఫేస్టోలో పెట్టిన విధంగా 5 వేల రూపాయలు గౌరవ వేతనంతో పాటుగా 3 వందల రూపాయల కమీషన్ అందించాలని కోరారు.

కొనసాగుతున్న నిరవధిక సమ్మె

● హరీశ్‌రావును కలిసిన గిరిజన ఆశ్రమ పాఠశాల కార్మికులు

గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హస్టల్స్‌లో పనిచేస్తున్న డైలీవేజ్, కాంటిజెంట్ వర్కర్ల నిరవధిక సమ్మె కొనసాగుతుంది. సమ్మెలో భాగంగా 18వ రోజు సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును వర్కర్స్ కలిశారు. తమ సమస్యలను హరీష్ రావు దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని వినతి పత్రం అందించి కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని హరీశ్‌రావు హమీ ఇచ్చారని వర్కర్స్ తెలిపారు. కలెక్టర్ గెజిట్ ప్రకారం జీతాలు చెల్లించాలని, తమను పర్మినెంట్ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

సంగ్రామం..

(5వ పేజీ తరువాయి)

భావనలో ఇప్పటికే పెద్ద నాయకులు ఈ సీటుపై కన్నేసి పావులు కదుపుతున్నారు.

మొదటగా నిర్వహించనున్న ఎన్నికలకు సంబంధించి అక్టోబరు 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన రోజు నుంచే నామినేషన్ల ప్రక్రియ పర్వం ప్రారంభకానున్నాయి. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలు నవంబరు 11న వెలువడుతాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో ఎన్నికల కోడ్ సోమవారం నుంచి అమల్లోకి వస్తున్నట్లు ఈసీ ప్రకటించింది. మేరకు ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సోమవారం కలెక్టరేట్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు జారీ చేశారు. ఇప్పటికే రెండు విడతల్లో ఎన్నికల సిబ్బందికి శిక్షణనిచ్చినట్లు, ఎన్నికల నిబంధనల మేరకు ఎక్కడా కూడా ఉల్లంఘన జరగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టినట్లు సిద్దిపేట జిల్లా కలెక్టర్ కే. హైమావతి తెలిపారు.

పల్లెలకు ఎన్నికల ఫీవర్

మండల పరిషత్, గ్రామ పంచాయతీలకు వెంటవెంటనే ఎన్నికలు జరగనుండటంతో పల్లెల్లో ఉత్సాభరిత వాతావరణం నెలకొంది. గ్రామంలో ఎక్కడ చూసినా ఇదే చర్చ సాగుతోంది. పార్టీలు ఎవరికి బరిలో నిలిపితే గెలుస్తాం. రిజర్వేషన్ వల్ల మన సీటు పోయింది.. కొత్త అభ్యర్థితో ముందుకు వెళ్తాం అంటూ అంచనాలు వేస్తున్నాయి. ఇక మా వార్డు నుంచి నేను పోటీ చేద్దాం అనుకున్నా.. కానీ మహిళా రిజర్వేషన్ వచ్చింది. ఈసారి మా అక్కను పోటీలో ఉంచుతా అంటూ ఓ ఔత్సాహిక చోటా నాయకుడు అంటున్నారు. యువత ఈ సారి ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. రిజర్వేషన్లతో గృహిణులు సైతం ఈసారి పోటీ చేయకతప్పని పరిస్థితి. ఇంత కాలం వార్డుల్లో, గ్రామాల్లో, మండల స్థాయిలో ఎన్నికలే లక్ష్యంగా పని చేసిన కొందరు పార్టీలు మద్దతు ఇవ్వకుంటే ఇండిపెండెంట్‌గా అయినా పోటీ చేయాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు.

పేదింటి కుసుమం గ్రూప్-2 విజేత


తల్లిదండ్రులతో సాయి ప్రియ

కొండపాక, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): చదువుకు పేదరికం అడ్డు కాదు సాధించాలనుకుంటే దేన్నైనా సాధించవచ్చు. లక్ష్యాన్ని ఏర్పరచుకొని దానిని సాధించే వరకు కష్టపడితే ఫలితం అందిపుచ్చుకోవచ్చు అన్న విషయాన్ని చేసి చూపించింది. కొండపాక మండలం మర్పడగ గ్రామానికి చెందిన మినుకూరి సాయి ప్రియ. ఆమె గ్రూపులో2 లో 826 ర్యాంకు సాధించి ఉద్యోగం సాధించింది. కడు పేదరికంలో పెరిగిన సాయి ప్రియ ప్రాథమిక విద్య ప్రైవేట్ పాఠశాలలో చదివి పదోతరగతిని మండలంలోని సిరిసనగండ్ల ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించింది. అనంతరం ఇంటర్ బీటెక్ చేసి పీజీ పూర్తి చేసింది. పీజీ చేసిన అనంతరం గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతూ వచ్చింది. గ్రూప్ 3, గ్రూప్ 4, గ్రూప్ 2 పరీక్షలను రాసింది. అందులో కూడా మంచి ర్యాంకు సాధించి ఉద్యోగం సాధించింది. గ్రూపు 3 లో విజయం సాధించి చేర్యాల మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ గా ఉద్యోగంలో చేరింది. అప్పుడు రాసిన గ్రూప్2 ఫలితాలు వెల్లడించడం తోపాటు మంచి ర్యాంకు సాధించి జీఏడీలో ఏఎస్‌వోగా ఉద్యోగం పొందింది.

రిజర్వేషన్లను సవరించాలి

మిరుదొడ్డి,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి):మిరుదొడ్డి మండలం లింగుపల్లి గ్రామానికి ప్రకటించిన జనరల్ మహిళా రిజర్వేషన్‌ను సవరించాలని గ్రామస్థులు ప్రసాద్, మహేష్, బాల్‌నర్సింలు, భాస్కర్, కిషన్ కోరారు. సోమవారం సిద్దిపేట ఆర్డీవో కార్యాయలంలో రిజర్వేషన్‌ను సవరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో అందరూ ఎస్సీ మాలలే ఉన్నారని, అయినా జరనల్ స్థానాన్ని కేటాయించడం అధికారులు ప్రజలను తప్పుదారిపట్టించడం జరిగిందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు పంచాయతీరాజ్‌చట్టం 2018 ప్రకారం ఎస్సీ మహిళను కేటాయించాలని కోరారు.

సరస్వతీదేవిగా దుర్గమ్మ

● 108మంది మహిళల ఒడిబియ్యం సమర్పణ


చేర్యాలలో చావడివద్ద దుర్గాదేవీకి సమర్పించిన 108కిలోల ఒడిబియ్యం

కొండపాక /చేర్యాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేవీనవరాత్రోత్సవాలను పురస్కరించుకుని చేర్యాల పట్టణంలోని చావడి వద్ద దేవిస్నేహయూత్ ఆధ్వర్యంలో సోమవారం అమ్మవారిని సరస్వతీ రూపంలో విశేషపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా నోట్‌బుక్కులు, స్టేషనరీతో పూజలు నిర్వహించిన అనంతరం చిన్నారులకు పంపిణీ చేశారు. అలాగే అమ్మవారికి 108మంది మహిళలు 108కిలోల ఒడిబియ్యం సమర్పించి మొక్కులుతీర్చుకున్నారు.

కొండపాకలో

కొండపాక మండలం మర్పడగ విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం విజయ దుర్గ మాత సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు.

మాదవానంద సరస్వతి స్వామి పూజలు

కొండపాక,సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం మర్పడగ క్షేత్రాన్ని రాంపూర్ పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా క్షేత్రంలోని విజయదుర్గా మాత మల్లికార్జున స్వామి దేవాలయంలో పూజలు చేశారు అనంతరం భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత


చేర్యాలలో గుంతలు పూడ్చివేయిస్తున్న సీఐ ఎల్.శ్రీను

చేర్యాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు స్థానిక యూనియన్ బ్యాంక్ ఏరియాలో జనగామ-సిద్దిపేట జాతీయప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను పోలీసులు కాంట్రాక్టర్‌చే పూడ్చివేయించారు. బతుకమ్మ, దసరా సందర్భంగా రాకపోకల రద్దీ పెరిగిన క్రమంలో గుంతల వలన ప్రయాణికులు ఇబ్బందులుపడుతున్నారు. ఈవిషయమై చేర్యాల సీఐ ఎ ల్.శ్రీను చొరవ వహించి గుంతలపూడ్చివేతకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. వరదనీటి ప్రవాహానికి గాంధీచౌక్, కడవేరుగు దారి, కల్వర్టు సమీపంలో ప్రమాదకరంగా ఏర్పడిన గుంతలను శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

'సద్దుల' వైభవం

(5వ పేజీ తరువాయి)

జరుగకుండా బోటులో ఈత గాళ్ళను ఏర్పాటు చేశారు.

తెలంగాణకు ప్రత్యేక స్థానాన్ని తెచ్చిన బతుకమ్మ

కొండపాక/సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో పువ్వులను పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణలోనే ఉందని, బతుకమ్మ ప్రపంచంలోనే తెలంగాణకు ప్రత్యేక స్థానాన్ని తెచ్చిన పండుగని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కొండపాక మండలం మర్పడగ విజయదుర్గ సమేత సంతానం మల్లికార్జునస్వామి క్షేత్రంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. ముందుగా క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సిద్దిపేట రూరల్ మండలం సీతరాంపల్లి, బండచేర్లపల్లి, పుల్లూరు గ్రామాల్లో మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు దుర్గామాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సీతరాంపల్లి గ్రామంలో దుర్గామాత మండం వద్ద కొబ్బరి కాయ కొట్టి ప్రత్యేక పూజలు చేశారు.